

ఎస్.వి.రమాదేవి

# తూర్పు-

డియర్ తనూ!

గుర్తు వున్నానా నేను? నేనూ....నేనంటే నీ చిన్ననాటి స్నేహితురాల్ని....నీ 'జానీ'ని! హమ్మయ్య! గుర్తు వచ్చే వుంటాను. మన పెళ్ళిళ్ళయేక మన మధ్య ఎంతో ఎంతో దూరం పెరిగింది కదూ? ఈ దూరాన్ని తరిగించటానికి మన మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడ సాగటం లేదు. ఆ మధ్య మన వూరు వెళ్ళినప్పుడు మీ అమ్మగారి దగ్గర నీ అడ్రసు సేకరించాను. ఎలాగూ ఇన్నాళ్ళ తర్వాత వ్రాస్తున్నాను కనుక, అన్ని విషయాలతో ఒక్కసారే పెద్ద వుత్తరం వ్రాసేస్తున్నాను. పూర్తిగా చదివే సహనం నీలో వుందో లేదో ముందుగా నిర్ణయించుకొని మరీ ఉత్తరంలోకి రా!

ప్రస్తుతం శ్రీవారు ఇంట్లో లేకపోవటం కూడ ఈ ఉత్తరం వ్రాయటానికి దోహదం కలిగించిందనుకోవచ్చు. తనూ! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి? నీతో మాట్లాడి? మన కాలేజీ రోజుల్ని ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకో! అప్పట్లో మనిద్దరి మధ్యా ఒక్కనాడైనా ఏ రహస్యాలైనా చోటు చేసుకున్నాయా? ఎప్పుడూ మనస్సు విప్పి, భూత వర్తమానాల్నే కాక భవిష్యత్తును గూర్చి కూడ ఊహాగానాలు చేసుకుంటూ, జీవితంలో ఎప్పటికీ ఇద్దరం అలాగే విడిపోకుండా మన మధ్య ఏ దాపరికాలకూ చోటు లేకుండా వుందామని ఎన్నిసార్లు మనం అనుకోలేదు?

కాని ఇప్పుడవన్నీ తలచుకుంటే నవ్వొస్తుంది. ఇప్పుడు మనం అప్పట్లా గాలిలో మేడలు కట్టి ఊహల సోపానాలనెక్కి వాటిలో స్వేచ్ఛగా విహరించటం లేదు. ఆధారంలేని ఊహలు-పునాది లేని మెట్లలా మనల్ని....మనం కట్టుకున్న మేడల లోనికి చేరనివ్వవనే సత్యం తెలుసుకున్నాం యిప్పుడు. అప్పుడనుకున్న వేవైనా ఇప్పుడు ఆచరణలో పెడుతున్నామా? కాకుంటే, మన పెళ్ళిళ్ళయి ఇన్నేళ్ళయినా ఒకరి జీవితాల్లోకి ఇంకొకరం తొంగి చూడలేదు. నీకూ నాకూ ఎంత ఎడం ఏర్పడిందో ఏ నాడైనా నీవు గమనించావా? సరేలే! నిన్ననేదేముందీ....నేనూ అంతేగా? సగం తప్పు నాలోనూ వుంది కనుక

నిన్ను క్షమించేస్తున్నాలే....! నిజానికి ఊపిరి సలుపని పనితో సతమతమయ్యే నాకు నా జీవితాన్ని పరిశీలించుకోవటానికే తీరిక చిక్కేది కాదు. మరి నీకెలా ఉత్తరం వ్రాయగలను?

'తను' నిన్నను కేంపుకి వెళ్ళారు. ఇప్పుడు ఒంటరిగా వున్న నాకు కావల్సినంత తీరుబడి! ఒంటరితనం మనిషిలో ఎన్నెన్ని ఆలోచనలను రేపుతుందో నీకు మాత్రం తెలియదూ? ఆలోచనల్లోనే గతించిన రోజుల్ని పునశ్చరణ చేసుకుంటూంటే నీవు గుర్తు వచ్చావు. ఒకనాటి మన పందెం గుర్తు వచ్చింది. అదేమిటో నీకు నేను గుర్తు చేయాల్నా?

ఇన్నాళ్ళూ నే గడిపిన జీవితం, నా బాధలు, కన్నీళ్ళు అన్నింటినీ ఈ ఉత్తరం నీకందజేస్తుంది. ఇది నిన్ను విసిగించదు కదా? ఐనా, నా స్వార్థం కోసమే అనుకో. నాలోని సగం వ్యధను నీతో పంచుకుంటున్నాను. కాలేజీ బ్యూటీవి నువ్వు! నా బాధ నీ కర్థం కాదేమో?

“రామ రావణ యుద్ధం జరిగినది అందం కోసమేగా? శిశుపాలుడు, కీచకుడు ఎట్సెట్రా రాక్షస సంహారం జరిగిందందుకేగా? అవి పుక్కిటి పురాణాలని కొట్టి పారేసినా, చరిత్రలో కూడ ఇన్ని ఎటువంటి సంఘటనలు లేవు? అప్పుడే కాదు. యుగయుగాలకూ ఈ అందం కోసం పోరాటం జరుగుతూనే వుంది....వుంటుంది కూడ!” అన్నావు నువ్వు.

“అవును. దానివల్ల ఒరిగిందేముంది? మంచేమీ జరగలేదుగా?” అన్న నా మాటకు, “ఏదైతేనేం? అందానికి అగ్రస్థానం ఇవ్వబడిందిగా! ద్రౌపది, సీత, క్లియోపాత్ర... సరే ఆ 'పాత్ర'ల వరకూ ఎందుకులే? నేటి యువతీ యువకులనే గమనించు. అందం కోసం, ఆకర్షణ కోసం ఎంత పాటుపడుతుంటారో, ఎందరు సినీ తారలననుకరిస్తూంటారో, వారి ఆకర్షణలకు లోబడి అల్లరి చిల్లర అబ్బాయిలెలా దీపం చుట్టూ తిరిగే పురుగుల్లా అమ్మాయిల వెంటబడుతుంటారో....

ఇదంతా 'అందం' అనే ఆ రెండక్షరాల ప్రభావమేగా? అందం మనిషికి సగం విలువనిస్తుంది. నలుగురిలో అందమైన వారికో గుర్తింపు వుంటుంది. పెళ్ళిళ్ళ మార్కెట్లో అమ్మాయిలకైతే కట్నపు రేటు తగ్గుతుంది. అబ్బాయిలకైతే హెచ్చుతుంది” అంటూ ఓ లెక్చరిచ్చి, “అందమే ఆనందం” అంటూ కొంటెగా పాడేదానివి చిన్నగా నవ్వుతూ.

నేనేమీ చిన్నబుచ్చుకోకపోయినా, నిన్ను అమాయకురాలైన ఓ పసిపాపను చూసినట్టు చూసే దాన్ని. జ్ఞాపకం వుందా? “అందంవల్ల బాధలు కూడ వున్నాయి తనూ! అందమైన స్త్రీ ఒంటరిగా వీధిలోకి వెళ్ళినా ప్రమాదమే! అయినా అందమనేది శాశ్వతం కూడా కాదు. ఒక్కొక్కప్పుడది అనుకోని రీతిగా అదృశ్యం కావచ్చు. అంచేత బాహ్య సౌందర్యం కంటే అంతఃసౌందర్యం వున్నవాడే వ్యక్తి రాణించేది” అని అప్పట్లో చదివిన పుస్తకాల్లోని ముక్కలనే మళ్ళీ మళ్ళీ వల్లించే

# పడమర



అయినా నా జీవితాన్ని నీ ముందు పరుచుకుంటున్నాను.

నువ్వనేదానివి “అందం ముందు అన్నీ దిగదుడుపే! ఏ యుగంలోనైనా అందంతో జయించలేనిదేదీలేదు. అందం రాజ్యాలేలించింది. ఎన్నో యుద్ధాలు చేయించింది. ఒకప్పుడు.... ఇప్పుడు....ఎప్పుడూ కూడ తిరుగులేని ఆయుధం అందం” అని. “ఎంత గర్వం?” అనుకునే దాన్ని. అప్పట్లో నాకలా అనిపించినా, లోతుగా ఆలోచిస్తే లోకపుతీరు నర్థం చేసుకున్న నీలోని 'ఆత్మవిశ్వాస'మదై వుంటుందనిపిస్తూందిప్పుడు!

“అందమే కాదు కావల్సినది. గుణం ముఖ్యం” అని పాత కథలలోని పాత మాటలతోనే వాదించే దాన్ని నీతో....ఏ మాత్రం అందం లేని నేను!

దాన్ని కదూ నేనే? టీనేజ్ కదూ 'తనూ' అప్పుడు! అనుభవం తక్కువ. అప్పట్లోనే ఓ రోజు మనం పందానిక్కూడా దిగాం. పందెం ఫలితాలు నిర్ణయించే అధికారం కాలానికే వదిలి పెట్టాం. ఇన్నాళ్ళు పరిశోధించిన కాలం ఏం నిర్ణయించిందో తెలుసా? నువ్వే గెలిచావని! నేను ఓడిపోయాను. పూర్తిగా ఓడిపోయాను తనూ!

ఈనాడు సమగ్రంగా నన్ను, నా జీవితాన్ని నీ ముందు పెట్టదలచుకున్నాను. కన్యగా నా జీవితం ఎలా గడిచిందో నీకు తెలుసు. నే చెప్ప బోయేది నా వైవాహిక జీవితాన్ని గూర్చి.

ఆయన తొలిసారి నన్ను చూడటానికి వచ్చారు. అంత క్రితం ఎందరో వచ్చి నేను బాగుండ లేదనే వెళ్ళిపోయారనుకో! వాళ్ళను చూసినా నువ్వు గెలిచావని అప్పుడు నేను అంగీకరించక పోయేదాన్ని. వాళ్ళంతా అమాయకులు. పై పై మెరుగులు చూసి భ్రమపడే మూర్ఖులుగానే ఎంచి, నాలో నేనే నవ్వుకున్నాను. తర్వాత ఆయన వచ్చారు. అతని అందచందాలు నా కనవసరం. ఆ కళ్ళల్లో అతని హృదయాన్ని చూసే ప్రయత్నం చేశాను నేను, ఆ కళ్ళుకూడా నన్ను పరికిస్తూంటే అతడ్నే చూస్తూన్న నా కళ్ళను మరో వైపు మళ్ళించుకోవటం తప్పనిసరైంది.

వాళ్ళు చూసి వెళ్ళిన వారం రోజులకు వచ్చిన ఉత్తరం చూసిన అమ్మా, నాన్నా దాదాపు ఇంట్లో పండగ చేసుకున్నారు. వాళ్ళకు నేను నచ్చానుట! త్వరలో ముహూర్తం పెట్టుకోవటమే తరువాయి. ఆ ఉత్తరం చూసి నేను కూడా పొంగిపోయాను. ఆయన విశాల హృదయానికి అంజలి ఘటించి, హృదయ కుసుమాలతో అర్చించాను. నన్ను ఆరోజు నిశితంగానే పరిశీలించారు. అయినా అంగీకరించారు.

కాని తనూ! నాయీ భావన నాలో ఎన్నాళ్ళో నిలవలేదు. కొద్ది రోజులకే మా వివాహ వేడుక ముగిసింది. పెళ్ళికి ఎన్ని ఉత్తరాలు వ్రాసినా రానే లేదు నువ్వు. ఆ తర్వాత కూడా మనం కలుసుకో లేదు. సరేలే! అసలు కథ....తర్వాతనే మొదలైంది. తనూ! ఆయన నన్నెందుకు చేసుకున్నారో తెలుసా? కేవలం నా డబ్బుకోసం! అందాన్ని కాకున్నా అలా డబ్బును చూసి చేసుకోవటాని కెవరైనా ముందుకు రావచ్చునని భావించే, కట్నం తీసుకునే వ్యక్తిని చేసుకోనని నన్ను చూడ వచ్చే వారికి ముందుగానే తెలియజేసేదాన్ని. ఈయన కట్నం కూడ వద్దనేసరికి, అది ఆయన విశాల హృదయానికి చిహ్నంగానే భావించాను. కాని తర్వాత తెలిసింది. అసలు విశేషం! నేను ఒకర్తినే సంతానం కనుక నాన్నగారి తదనంతరం నాన్న ఆస్తి నాకే రావచ్చనే దూర దృష్టితో చేసుకున్న ఆయన తెలివి తేటలకు ఆయన్ని అభినందించక తప్పలేదు. అది గ్రహించినాక, నా జీవితమే మారిపోయింది. నా ముప్పై ఏళ్ళ అనుభవంతోనే ముడుతలు పడింది నా శరీరం; మనసూ కూడా. ఆయన నారూపాన్ని అసహ్యించుకోని రోజు వుండదు. ఆయన సంభాషణల్లో ఎక్కడైనా 'దిష్టిబొమ్మలా' అనాల్సి వస్తే ఆ నాలుగక్షరాలకు శ్రమపడకుండా - వాటికి పర్యాయపదంగా 'జానకిలా' అని ఉపయోగిస్తారు. వక్రంగా వున్న ఏ వస్తువు వారి దృష్టిలో పడినా ముందుగా వారికి తట్టేది నా రూపమే! "నన్ను వివాహం చేసుకునే ముందు ఈ రూపం కనబడలేదా?" అని ఉక్రోషంగా ఎప్పుడైనా ప్రశ్నిస్తే.... "అలి మర్కటం, ఇల్లు ఇరకాటం గానూ వుంటే మంచిదని చేసుకున్నా" నంటారు ఎగతాళిగా. ఈ నల్లని ఊచలాంటి శరీరాన్ని సృష్టించిన భగవంతుడు, అందులో ఇంత సున్నితమైన ఆలోచించే హృదయాన్ని అమర్చట మెందుకో నాకు అర్థం కావటం లేదు.

ఇప్పుడాయన నాతో మాట్లాడటమే లేదు. వారం రోజులుగా మా మధ్య తీవ్రయుద్ధం సాగుతోంది. ఆయనకు ఉద్యోగం చేయటం అసలిష్టం లేదట. ఏదో తల్లి బాధ పడలేక ఉద్యోగంలో చేరార్ట! ఉద్యోగ మంటే ఒకరికి లొంగి వుండాల్సిన బానిస బ్రతుకుట! ఎవరో మానాన్నకు 'గుండె జబ్బు' వుందని చెప్పబట్టీ, ఆ జబ్బు వున్నవాళ్ళు చాలా కాలం జీవించి వుండరనే నమ్మకం ఆయనకుండ బట్టీ....తను నన్ను చేసుకున్నార్ట. కానీ, ప్రస్తుతం అలాంటి జబ్బులేం నాన్నగారిలో కన్పించక పోవటంతో....సాధ్యమైనంత త్వరలో నాన్న నడిగి డబ్బు తీసుకు వస్తే ఉద్యోగానికి తిలోదకాలిచ్చి, ఏదైనా స్వంత బిజినెస్ పెట్టాలని ఆయనకున్న ప్రగాఢమైన కోరికల్లో మొదటిదట! లేకుంటే ఈ వివాహ బంధానికే తిలోదకా లిచ్చేస్తారట! కట్నం కోరని విశాల హృదయుడైన అల్లుడు డబ్బు కోసం తాళి కట్టిన భార్యకు విడాకు లిచ్చేస్తానంటున్నాడని నాన్నతో నేనెలా చెప్పను?

మరో విషయం తెలుపనా? ఓసారి ప్రక్కింటామెతో కలిసి కూరగాయలకని మార్కెట్‌కి వెళ్ళిన నేను ఎదురుగా రిక్షాలో పోతున్న జంటను చూసి హతాశురాలి నయ్యాను. ముందు నమ్మలేక పోయినా, మరో రెండడుగులు వేసేక, పది గజాల దూరంలో ఆగిన రిక్షాలోంచి దిగిన ఓ అందమైన అమ్మాయినీ, ప్రక్కనే దిగుతూన్న ప్రొద్దుటే నా చేతుల్తో ఇస్త్రీ చేయించి వేసుకున్న ఆ గళ్ళ చొక్కా స్వంతదారునూ, ఆ నడకనూ.... గుర్తు పట్టలేనంత అమాయకత్వం లేనందుకు ఒకందుకు నేనూ విచారిస్తున్నాను.

ఆ సాయంత్రం ఆయన రాగానే, ప్రత్యేకించి ఏదో యాథాలాపంగా అడిగినట్టు కాఫీ కలుపుతూనే అడిగాను. "ఫలానా .... ఫలానా ఆమె ఎవరండీ?" అని, అంటే ఆ ప్రశ్న వెనుక ఆయన పైనున్న నా నమ్మకం, ఆమె వివరాలు ఆయన ద్వారానే తెలుసుకోవాలనే కుతూహలం కలిగించిందన్న మాట! ఎంత కర్కశ హృదయులైనా, తాము తప్పు చేసినప్పుడది ఎదుటి వాళ్ళు గ్రహించారనగానే తడబడక మానరు. ఆ తడబాటే ఆయనను పట్టించి నట్టయింది నాకు. ఆ తర్వాతేదో చెప్పినా అవి నమ్మతగ్గవి కావని నాకు తెలుసు.

తర్వాత అనుకోకుండానే నాకు తెలిసిన వివరాలివి. ఆమె పేరు సునీత. వాళ్ళ ఆఫీసులోనే పని చేస్తున్నా, వెనుక ఏ ఆధారమూ లేనిస్త్రీ! కథ మామూలేననుకున్నాను. ఇలా పురుషుల వెంటపడే స్త్రీలను, అదీ....వివాహితులైన

"స్త్రీ యిహసుఖములకై ఆరాటపడరాదు. భర్త ధర్మమును కాపాడుట, తన ధర్మమును కొనుట, బిడ్డలకు ధర్మబోధలు చేయుట, అతిథి అభ్యాగతులను శక్తి కొలది సేవించుట, సాధువులను పోషించుట-మిగిలిన కాలమందు తన మనస్సును పరిశోధనము చేసుకొనుట ఉత్తమ స్త్రీకి విధి."

—శ్రీసాధ్వీ రత్నమ్మ

పురుషులతో తిరుగాడే స్త్రీలను చాలామంది అతి తేలిగ్గా చూడడం గమనించే వుంటావు నువ్వు! పాపం ఇందులో సునీత తప్పేం వుండివుంటుంది! వివాహం చేసుకునే స్తోమతా, తగిన దక్షతా, అవకాశాల్లేక అవివాహితులుగా మిగిలిపోతూ, అలా వాళ్ళ మానాన వాళ్ళున్నా వాళ్ళను వేధించుకు తినే ఈ సంఘ జీవులను ఎదిరించలేక తమకు ఏమాత్రం ఆసరా దొరికినా అల్లుకుపోవాలనే మనస్తత్వం ఏర్పరచుకుంటూన్న స్త్రీలు ఎందరో మన సంఘంలో! అట్లాంటివారికి లేని ఆశలు చూపి, ఆకర్షణలు వెదజల్లి కల్లబొల్లి కన్నీటి కథలు చెప్పి లొంగదీసుకునే పురుషులను పటించుకోని లోకం వారి వెంటనుండే స్త్రీలపై తేలిగ్గా మాటలు విసరగల్గుతుంది. నా విషయంలో నేను సునీతను తప్పుపట్టను. నాకీ 'సునీతా శ్రీవారుల' విహారయాత్రల విషయసేకరణ చేసినవారు సునీత విషయంలో చాలా నీచంగానే మాట్లాడినా ఆ విషయంలో నేను వారితో ఏకీభవించను. ఎందుకంటే, పాపం ఆమెకు ఆయన ఏమని చెప్పారో....తాను అవివాహితుడననే చెప్పుకున్నారో, లేదా తనకు వివాహమైనా అది తమ పెద్దల బలవంతపు వివాహమనే చెప్పారో, లేక నేనే ఏ గయ్యాళినో, రోగిష్టినో లేదా ఏ పిచ్చి దాన్ననో చెప్పుకున్నారో.... స్త్రీల సున్నిత హృదయాలను లోబర్చుకోవటానికి పురుషులు చెప్పే కట్టు కథల విషయం లోకానికేం తెలుస్తుంది....స్త్రీని నీచంగా చూడడం తప్పించి!

సరే....నా అభిప్రాయాలలావుంచు. సునీతను గూర్చి అడిగినప్పుడాయన ఏదో బుకాయించినా, మొన్న..క్యాంపు వెళ్ళేముందు జరిగిన వాగ్వాదంలో ఆయన తప్పనిసరిగా చెప్పేసారు 'నేను అడిగినంత డబ్బూతెచ్చి ఇవ్వకుంటే తన పైనే ఆశలు పెట్టుకున్న సునీతను తాను వివాహం చేసుకోదల్చు'కున్నట్టు! చట్టాలు-విరిగిన మనసుల్ని అతకలేవని ఆయనకీ బాగా తెలుసుమరి! ఇంకేం మాట్లాడను?

ఇదీ సంగతి! నేను నా జీవితంలోనే కాదు, నీతో కూడా ఓడిపోయానని తెలుపుకోవటానికే ఈ నా లేఖ! జవాబు వ్రాస్తావుకదూ? జీవితంలో గెలుపుతోకూడిన నీ మధురమైన జీవితాన్ని చూచి, నేను ఈర్ష్య చెందుతానని మాత్రం వ్రాయటం మానేయకుసుమా!

నీ....

అలనాటి జానకి (రూపానికి కాదు!)

"స్త్రీ ప్రకృతి ఎల్లప్పుడును తన సహన శక్తి చేతను, ప్రేమపూరిత హృదయము చేతను, సునిశితమైన బుద్ధి చాతుర్యము చేతను, మృదు మధుర మంజుల వాక్కుల చేతను పైకి జయించినట్లు కనబడినను లోకమునంతటిని తన అరచేతను ఇముడ్చుకొనగల్గినంత శక్తినిగల్గియున్నది."

—వెలిదండి చూడికుడుతమ్మ

ఉత్తరం చదవటం ముగించిన తనూజకెందుకో నవ్వు వచ్చింది. వెంటనే ఆ ఉత్తరాన్ని తన డైరీలో భద్రపరచి, లెటర్‌ప్యాడ్ తీసి వ్రాయటం ప్రారంభించింది. ఆమె హృదయంలో సుళ్ళు తిరిగే భావలహరిని కలంతో అదుపులోకి తెచ్చుకుంటూ అక్షర రూపంలో వాటి నొక్కొక్కటిగా కాగితంపై చిందించసాగిందామె.

డియర్ జానకీ!

నిన్ను 'డియర్ జానకీ' అని సంబోధించే కంటే 'పిచ్చి జానీ' అని సంబోధించాలనిపిస్తూందెందుకనో? దూరపు కొండలు నునుపనే సామెత విన్నావుకదూ? నీ ఉత్తరం చూసి ఆ సామెత మనపట్ల రుజువైనందుకు నాలో నేనే నవ్వుకున్నాను. నా జీవితంలోని సుఖదుఃఖాలను నీతో పంచుకోవటానికి నన్ను కూడా ప్రోత్సహించింది నీ ఉత్తరం. దాని ఫలితమే ఈ....లేఖ!

జానీ! నీ ఉత్తరం మన కాలేజీనాటి సంఘటనలన్నీ కళ్ళముందు ఒక్కసారి కన్పట్టేలా చేసింది. నువ్వు ఓడిపోయానన్నావు. కానీ.... నువ్వు ఓడిపోయినది నాతో వేసిన పందెంతో కాదు. నువ్వన్నట్టు కేవలం నీ జీవితంలో నువ్వోడిపోయావంతే! కాలం నన్ను గెలిపించిందని కూడా అన్నావు. నేను కూడా ఇంతవరకు నీ గూర్చి అలాగే భావించేదాన్ని సుమా! కాని జానీ! నీ ఉత్తరం చదివేక ఇప్పుడేమనిపిస్తూందంటే ఓ విధంగా కాలం మనిద్దర్నీ ఓడించిందని! అందగత్తెననే అహంభావంతో అందంపై ఏవేవో ఉపన్యాసాలిచ్చేదాన్ని కదూ? నా అభిప్రాయాలన్నీ తలక్రిందులై పోవటానికి కారణం మనిద్దర్లో ఏ ఒక్కరికీ గెలుపు దక్కనివ్వరాదనే విధినిర్ణయం వల్లనేమో?

ఈ ఉపోద్ఘాతాన్ని వదలి అసలు విషయానికి వస్తున్నాను. కొంచెం నా జీవితాన్ని కూడా పరిచయం చేసుకో!

మావారు పూర్తిగా మీ ఆయనకు వ్యతిరేకులు. అది గ్రహించటానికి కొన్ని నెలలే పట్టిందనుకో! అంతవరకూ గ్రహించుకోలేని దద్దమ్మను నేను. క్లాసు పరీక్షల్లో ఫస్టు మార్కులే తెచ్చుకున్నా, జీవిత పరీక్షల్లో కనీసపు మార్కులు కూడా సంపాదించుకోలేని మూర్ఖురాల్ని. ఆయన మనస్తత్వాన్ని తొలుదొల్త గ్రహించగలిగిన సంఘటన ఏదో నీకూ తెలియజేస్తాను. మా పెళ్ళయిన కొద్దినెలలనంతరం....ఓసారి వారి ఫ్రెండ్ ఒకతను భార్యా సమేతంగా వచ్చి తన బర్త్‌డే పార్టీకి మమ్మల్నాహ్వానించాడు. ఇద్దర్నీ కూడా ఎలాగైనా రమ్మని పదేపదే చెప్పి వెళ్ళాడు.

ఆ మరునాడు ఆయన ఆఫీసునుండి రాకముందే రెడీగా వుండాలని గబగబా స్నానమదీ చేసి ముస్తాబయ్యాను. నాకు బాగా నప్పుతుందని ఎప్పుడూ నీవు పొగుడుతూండే ఎరుపురంగు పట్టు చీర, ఎర్రని బ్లౌజు వేసుకున్నాను. చెవులకు ఎర్ర రాళ్ళు పొదిగిన జాలరీ జూకాలు, చేతులకు బంగారు గాజుల మధ్య ఎర్రని మట్టి గాజులు, మెళ్ళో ఎర్రరాళ్ళ హారం....సరే....ఇదేరకమైన ముస్తాబుతో, నుదుట ఎర్రని సిందూరం దిద్దుకుంటూ అద్దంలోని నా ప్రతిబింబాన్ని చూస్తూ నాలో నేనే మురిసిపోయాను. ఆ రకం డ్రెస్ వేసుకున్నప్పుడల్లా కాలేజీలో నాకు ఏర్పడ్డ బిరుదు గుర్తు వచ్చింది. 'ఎర్ర కలువ!' అనుకోకూడదు గానీ ఆ క్షణంలో నన్ను నేనే అభినందించుకున్నాను... 'నిజంగా ఆప్పుడే వేయి రేకులతో విరిసిన ఎర్ర కలువ'లానే వున్నానని!

నేనింకా ఈ మైమరపులోనే వుండగా, ఆయనటు ఆఫీసునుండి రావటం, ముఖమదీ కడుక్కుని డ్రెస్ మార్చుకోవడం కూడా జరిగినట్టుంది. ఫుల్‌సూటుతో నా గదిలోకి వచ్చి 'టై' కట్టుకుంటూ నావేపు ఓసారి చూశారు.

"ఐయామ్ రెడీ" అన్నాను హుషారుగా.

"ఎక్కడికి?" అన్నారాయన నన్ను ఎగాదిగా చూస్తూ.

"అదేమిటండీ? మీ ఫ్రెండ్ పుట్టిన రోజు పార్టీకి పిలిచారుగా?" అన్నాను. కొంపతీసి మరచిపోయి ఏ పిక్చరుకో, క్లబ్బుకో వెళ్ళిపోతారేమోనని భయపడి.

"నువ్వు కూడా వస్తావా ?" అన్నారాయన ఆశ్చర్యంగా.

అది విని నేను నివ్వెరపోయాను.

"చూడు. అక్కడికి ఎంతోమంది మగవాళ్ళు వస్తారు. వారందరి మధ్యకూ నిన్ను తీసుకెళ్ళాలా? వద్దులే!" అన్నారాయన.

"వస్తే? వాళ్ల కూడా భార్యా పిల్లల్తోనే వస్తారుగా? అదీకాక మనల్నిద్దర్నీ రమ్మని వాళ్ళు అంతగా చెప్పారు. వెళ్ళకుంటే బావుంటుందా?" అన్నాను ధైర్యం చేసి.

"మరేం పర్లేదు. నేను కూడా వెళ్ళకపోయినా వాళ్ళ పార్టీ దివ్యంగా జరుగుతుంది. అసలే వాళ్ళంతా వెకిలిమనుషులు. ఎవరేనా కాస్త అందంగా వుంటే పడిచస్తారు. వాళ్ళ చూపులకు నిన్ను కేంద్రంగా చేయడం నాకిష్టం లేదు. అంతే!" అనేసి అక్కడినుండి వెళ్ళిపోయారు.

నేను నిశ్చేష్టురాలినై నిల్చుండిపోయాను. వెలుపల స్కూటరు స్టార్టయి, ఆపైన అది వెళ్ళిపోయిన చప్పుడును నా చెవులు గ్రహిస్తూనే వున్నాయి.

అద్దంలోని 'ఎర్ర కలువ' నన్ను పరిహసించింది.

పెళ్ళయేక ఒక్కొక్కటిగా ఆయన ప్రవర్తనలోని అంతరార్థం ఆనాడే గ్రహించగలిగాను. ఆయన రాకకోసం "వీధి గుమ్మంలో నిల్చోనక్కరలేదం"టే 'శ్రమపడి నిల్చోవటమెందుక'ని అలా అన్నారేమోననుకున్నాను. ఓసారి పని వుండి ప్రక్కవాళ్ళింటికి వెళ్ళానని "వచ్చేసరికి ఇంట్లో వుండకుండా వీళ్ళింటికీ, వాళ్ళింటికీ వెళ్ళటమెందుక"ని ఆయనంటే, 'ఆయన తిరిగి తిరిగి వచ్చేసరికి నేను కనిపించకుంటే ఆయనకు తోచదేమో' ననుకొని నాలో నేనే గర్వపడ్డాను. ఇక్కడ కొత్తగా పరిచయమైన కొందరమ్మాయిలు ఏదో పిక్చరుకి వెళ్తూ నన్నూ రమ్మంటే, ఆయనది విని "మనం ఎప్పుడైనా వెళ్ళొచ్చులే; వీళ్ళతో వాళ్ళతో వెళ్ళేదెందుకు?" అన్నారు. 'నన్ను తనతో తీసుకెళ్తేనే ఆయనకు తృప్తిగా వుంటుందేమో'నని నన్ను నేను సరిపుచ్చుకొని, వాళ్ళకేదో సర్దిచెప్పాను. తర్వాత ఆయన సినిమాకు నన్ను తీసికెళ్ళకపోయినా.....అదికాదు..... పెళ్ళయిన తర్వాత ఒక్క సినిమాకైనా నేను వెళ్ళలేక పోయినా, కొన్నాళ్ళు వీలుకాక తీసికెళ్ళలేదనీ, మరి కొన్నాళ్ళు ఆయనకు సినిమాలంటే ఇష్టం లేదేమోననీ నన్ను నేను సమర్థించుకున్నాను. సినిమాలకేకాదు. ఆ ఆరునెలల్లోనూ...ఆ ఇల్లూ... ఆ ఇంటికున్న గోడలూ....అంతే నాకు పరిమితం అయినా, నేనాట్టే పట్టించుకోలేదు. ఆ అవసరం కూడా కలుగలేదు. కాని.....కాని.....ఆయన హృదయం ఇంత సంకుచితమైనదని నేనూహించలేకపోయాను. ఒక వ్యక్తిపై ఏర్పరచుకున్న నమ్మకం, అనురాగం...ఎన్ని అసాధ్య సంఘటనలనైనా ఇట్టే సమర్థించుకునేలా చేస్తాయి. అది ఆ నమ్మకం సడలనంతవరకూ మాత్రమే! ఆ నమ్మకం సడలితే మాత్రం ప్రతి సంఘటనా భూతద్దంలోంచి కనిపిస్తూ భయపెడుతుంది. కౌనా?

కట్టుకున్న చీరను విప్పకుండానే మంచంపై వాలిపోయిన నా హృదయమంతా ఒక్కసారి బరువెక్కి, కన్నీళ్ళ రూపంతో తనకు తానే తేలికపరుచుకుంది.

మరో సారేం జరిగిందో తెలుసా?

ఆరోజున వారి కాలేజీ మిత్రులు కొందరు వచ్చారు. వాళ్ళతో హాల్లో బాతాఖానీ కొడుతూ కూర్చున్న ఆయన మధ్యలో లోనికోసారి వచ్చి కాఫీ తయారుచేయమని చెప్పి వెళ్లిపోయారు. నేను తయారుచేసి ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. కాని ఆయన బాతాఖానీలో మునిగి తేలుతున్నారేమో, ఎంతకూ ఇంట్లోకి రాలేదు. ఓ వంక కాఫీ చల్లారిపోతూంటే, నేనే కాఫీ తయారయ్యాక తెస్తానని చూస్తున్నారేమో నను కొని, నేనే వెళ్ళి అందరికీ కాఫీ లందించాను. ఆయన కప్పు నందుకుంటూ ఓసారి నా వంక తీవ్రంగా చూశారు.

తడబడే అడుగులతో లోనికి వచ్చేస్తూన్న నాకు, "నీ శ్రీమతేమిట్రా? అరె! మాకు పరిచయమే చేయలేదేమిటోయ్? నీకింత అందమైన శ్రీమతి వుందని మేము ఈర్ష్య పడతామనా?" అన్న మాటలు చిరుహాసాలతో పాటు వినబడ్డాయి. ఆ మాటల కాయన ముఖ భావాలెలా మారాయో నాకయితే కనిపించలేదు గాని, ఊహించగలిగాను.

వాళ్ళంతా వెళ్ళాక, నేనూహించినంతా జరగనే జరిగింది. ఆయన లోనికి వచ్చారు విసురుగా. నేను కళ్ళప్పగించి చూస్తున్నాను.

"నిన్ను కాఫీ తెమ్మని ఎవరు చెప్పారు?" ఇది ఆయన కోపాన్ని నిగ్రహించుకుంటూ పలికిన తొలి ప్రశ్న.

"మీరు....మీరేగా చేయమన్నారు?" అన్నాను తడబడుతూ.

"చేయమంటే తీసుకురమ్మనా అర్థం?"

"మీరెంతకూ లోనికి రాకుంటే....మరి కాఫీ చల్లారి....ఊహుఁ....నేనే తెస్తానని ఎదురు చూస్తున్నారేమోనని...."

నా మాటలు కొనసాగ నివ్వకుండానే, ఇక కోపాన్ని దాచుకునే నిగ్రహం లేక కాబోలు, "అవు" అంటూ గర్జించా రాయన. "ఈ కల్లబొల్లి కారణాలు చెప్పటం దేనికి? అందగత్తెవనే గర్వం నీకెక్కువ. నీ అందం ఈ నాలుగ్గోడల మధ్య ఇమిడిపోవటం నీకు బాధగా వుంది. అవునా? అందుకే ఈ ప్రదర్శన. ఇంటికెవరైనా రావటం తరవాయి, ఓసారి వాళ్ళక్కనిపించి నీ అంద చందాలు ప్రదర్శించనిదే నీకు...."

చాలు! నేను ఇంక ఆయన మాటల్ని విన దల్చుకోలేదు. ఆయన స్వభావ, సంస్కారాల అవగాహన కా మాటలు చాలు. ఆయన్నా సమయంలో మాటల్తో ఎదిరిస్తే ఫలితం మరీ దారుణంగా మారుతుందనే గ్రహింపు నాకుంది. అనవలసిన వన్నీ అనేసేక, ఆయన కాస్త తృప్తి పడ్డట్టున్నారు, ఆ పైన విసురుగా వెళ్ళిపోయారు. మళ్ళీ మేము మూడ్‌లోకి వచ్చేసరికి మరి రెండ్రోజులు ముభావంగానే గడిచిపోయాయి.

మరో సంఘటన:

డోర్ కర్టెన్స్ పాతబడి చిరిగిపోవటానికి సిద్ధంగా వున్నాయి. నేను చెప్పక ముందే క్రొత్తవి తెచ్చారు వెంటనే. వాటిని ప్రతీద్వారానికీ అలంకరించసాగాను. మధ్య హాలుకీ, ఇంటికీ మధ్య నున్న ద్వారానికి మామూలుగానే నేల నుండి కొంచెం ఎత్తుగా వుండేలా చూసి పెట్టబోయాను. ఆయన వచ్చి నేలపై జీరాడేలా క్రిందుగా కట్టారు దాన్ని.

"భూమిపై పారాడినట్టు అదేం బావుంటుంది? కొంచెం పైకి వుంచేనే అందంగానూ వుంటుంది; మన్నికకూ పనికొస్తుంది" అన్నాను నేను మామూలుగా.

"ఏం? వీధి గదిలో కూచున్న వాళ్ళందరికీ కనీసం నీ పాదాల సౌందర్యమైనా చూపాలనా?"

ఎగతాళిగా వినవచ్చిన ఆ సమాధానానికి విస్తుపోతూ నోరు పెగలక నిల్చున్నా.

ఆ కర్టెన్ని ఆయనేకట్టి, మిగతావి నా ముఖాన పారేసి వెళ్ళిపోయారు. ముఖాన పారేశారో, చేతి

కిచ్చారోగాని, నా కా సమయంలో అలానే అనిపించింది మరి!

రోజులు గడిచేకొద్దీ ఆయన మనస్తత్వం ఒక్కో సంఘటన ద్వారా వెల్లడౌతూన్న కొద్దీ.... నేనుగా ఆయన్ని ఏ ఫంక్షన్కైనా, పిక్చరుకైనా వెళ్దామని అడిగేందుకు కూడ నా మనస్సంగీకరించలేకపోయేది. 'భార్యా రూపవతీ శత్రుః' అనే లోకోక్తి ఆయనలో బాగా జీర్ణించిపోయింది. అదే ముక్కను నా దగ్గర ఎన్నోసార్లు ఆయనే అన్నారు.

ఓసారి భోజనాల సందర్భంలో "యిది విన్నావా?" అన్నారాయన.

"ఏది?". అన్నాను నిర్లిప్తంగా.

"మా ఫ్రండ్ లేడూ వెంకట్రావని....?" మొదలెట్టారాయన.

"ఏ వెంకట్రావ్?" అనే ధైర్యం నాలో లేదు. 'చెప్పేది వినకుండా వాడి సంగతి ఆరా తీసేంత అవసరం నీకేముంది?' అంటారని నాకు తెలుసు. అయినా ఆయన ఫ్రండ్సెవరో, వాళ్ళ పేర్లేమిటో నాకు తెలియదు. ఆయన ఏనాడూ పొరపాటున కూడ నాతో చెప్పలేదు. అందమైన స్త్రీలను నమ్మకూడదని కదా ఆయన సిద్ధాంతం. అందుకనే నన్ను నమ్మరాయన. అయినా ఈ విధమైన అపనమ్మకంతో ఆయన పోగొట్టుకుంటున్నదేమిటో ఆయనకే అర్థం కావటంలేదు. ఎంత 'ద్రోహి' నైనా పూర్తి విశ్వాసంతో చేరదీస్తే, అతను తనను నమ్మిన వ్యక్తికి ద్రోహం తలపెట్టడే! అటువంటిది ఈ వ్యర్థమైన అపోహలతో తనకు ఎంతదూరమౌతున్నారో ఒక్కనాడైనా గ్రహించరేం ఆయన??

సరే! ఆయన ఫ్రండ్స్‌లో ఒకరిపేరు వెంకట్రావని ఆనాడే తెలిసింది. అందుకే కొంత నివ్వెరపోయాను 'కారణమేమిటా?'ని!

ఆయన చెప్పుకుపోతున్న విషయసారాంశమిది. 'ఆ వెంకట్రావనే అతడి భార్య దాదాపు రెండేళ్ళ క్రితమే అతడికి విడాకులు ఇచ్చేసిందంట (ఆమె అంత విసిగి విడాకులు తీసుకుందంటే.... నా దృష్టిలో ఆ మహానుభావుడెంత 'సుగుణుడో' మరి!) సరే! వాళ్ళిద్దరికీ సరిపడక విడిపోయారనీ అనుకున్నారట వీళ్ళంతా అప్పట్లో. కాని ఇప్పుడామె మరో వ్యక్తిని మేరేజ్ చేసుకుందట! దీనివల్ల వీళ్ళు నిర్ణయించుకున్నదేమిటంటే 'వాళ్ళిద్దరికీ ఇదివరకే స్నేహముండి వుంటుంది. ఎవరి ప్రమేయంవల్లో ఈ వెంకట్రావుని చేసుకున్నా, వారి అడ్డు తొలగిన వెంటనే విడాకులు తీసుకుని, అతడ్ని చేసుకునివుంటుంది'....అని. అంతా చెప్పేక 'ఏమైనా ఈ ఆడవాళ్ళను నమ్మకూడద'నే తన ప్రగాఢాభిప్రాయాన్ని వెలిబుచ్చేసి జోక్ చేస్తున్నాననుకొని కాబోలు ముఖమంతా నవ్వు పులుముకుంటూ ముగించారాయన తన లెక్చరునీ, భోజనాన్నీ కూడ.

నా జీవన మాధుర్యాన్ని వివరించేందుకి సంఘటనలు చాలనుకుంటాను. నీలాగే గతాన్ని పునశ్చరణ చేసుకునేప్పుడల్లా ఒకనాటి నీ మాటల్ని ఖండించే నా తెలివితక్కువ తనానికి నాకు నేనే జాలిపడేదాన్ని. కాని ఇప్పుడు....

జానీ! జీవితంలో ఏ ఒక్క విషయానికీ ఒక నిర్వచనం అంటూ చెప్పటం ఎంతో కష్టం. విధి నడిపించేట్టు నడిచే ఈ జీవితాలకు నిర్వచనాలు చెప్పేంతవారమా? అందంతో ఏదేదో సాధించవచ్చుననుకునే నేను నా దాంపత్యాన్నే సవ్యంగా సాగించుకోలేని అసమర్థురాలినయ్యానంటే నా అందం నాకు ఒరిగించిందేమిటి? మనిషి ఆనందానికి ముఖ్యం అందమూ కాదు. సుగుణమూ కాదు. కేవలం అదృష్టం....లేదా మరో మాటలో చెప్పాలంటే సంఘానికి ఎదురీదగలిగే మనస్థైర్యం! ఎందుకంటే....తరతరాలుగా మన సంఘంలో పాతుకొని పోయిన పురుషాధిక్యత స్త్రీ మనస్తాపానికి కారణమౌతూంది అనాదిగా. దానిని ఎదిరించగలిగే మనస్థైర్యాన్ని, నిబ్బరత్వాన్నీ ఎవరో ఎందుకు....మనతోటి మహిళలే హర్షించలేరు. ఆ పరివర్తన మన చుట్టూవున్న మహిళలలో వచ్చేంతవరకూ మనం....పంజరంలో పక్షులం! అంతే!!

నీ

అందానికేగాని ఆనందానికి నోచుకోని

తనూజ

*

---

❋

సిగరెట్లు ఆరోగ్యాన్ని బాగా పాడుచేస్తాయని, అవి కాల్చకూడదనీ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా – సిగరెట్లు కాల్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉన్నది! '71లో సిగరెట్ల ప్రచారం మీద, అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆ సంవత్సరంలో 547 బిలియన్ల సిగరెట్లు (అంటే-ఐదువందల నలభై ఏడు లక్షల కోట్లు) అమ్ముడు పోగా, '75లో 600 బిలియన్ల సిగరెట్లు అమ్ముడుపోయాయట. సిగరెట్లు కాల్చే వారిలో మాటికి తొంభై మందికి 'లంగ్ కాన్సర్'లాంటి వ్యాధులు వస్తున్నా కూడా, సిగరెట్లు తాగడం పెరిగిందంటే– పెద్దలు ఆశ్చర్యం ప్రకటిస్తున్నారు. అమెరికా దేశంలో పదిహేను, ఇరవై



సంవత్సరాల వయసుగలవారే ఎక్కువగా సిగరెట్లు కాలుస్తున్నారనీ, వాళ్ళలో ఆడపిల్లలే ఎక్కువగా ఉన్నారనీ వార్తలు చెబుతున్నాయి!

❋